భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

16, నవంబర్ 2026, సోమవారం భారత్ సమాచార్

బీవీఆర్ఐటీలో ఘనంగా IEEE IES డే వేడుకలు



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: ఎలక్ట్రిక్ వాహనాలు (EV), హరిత ఇంధన సాంకేతికత రంగాల్లో వస్తున్న మార్పులు, భవిష్యత్తులో అందుబాటులోకి రానున్న అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నర్సాపూర్‌లోని జీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BVRIT)లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం IEEE IES డే–2026 వేడుకలను ఘనంగా జరిపారు.



ఈ సందర్భంగా గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ భుజంగరావు తాడి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సాంకేతిక అంశాలపై ప్రసంగించారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ విధానాలు, వాటిలో ఉపయోగిస్తున్న ఆధునిక టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలు, పరిశ్రమల్లో వాటి వినియోగం గురించి వివరించారు. EV రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఈ సాంకేతికతపై పట్టు సాధించాలని సూచించారు.

హరిత ఇంధన వనరుల ప్రాధాన్యత, పర్యావరణానికి అనుకూలమైన సాంకేతిక పరిజ్ఞానం, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో వస్తున్న మార్పుల గురించి కూడా ఆయన వివరించారు. ఈ రంగాల్లో భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగ, పరిశోధన, సాంకేతిక అవకాశాలు అందుబాటులో ఉంటాయో విద్యార్థులకు తెలియజేశారు. తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను పరిశ్రమల్లో ఉపయోగించే విధానాలతో అనుసంధానం చేసుకోవడం ద్వారా మెరుగైన నైపుణ్యాలు సాధించవచ్చని వివరించారు.



ఈ కార్యక్రమంలో B.Tech, M.Techకు చెందిన మొత్తం 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న కొత్త మార్పులు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ విధానాల గురించి తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభించింది.



కార్యక్రమంలో భాగంగా మంగళవారం 45 మంది విద్యార్థులు మెదక్ జిల్లా తూప్రాన్‌లోని గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పరిశ్రమను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్రక్రియ, పరిశ్రమలో నిర్వహించే వివిధ కార్యకలాపాలు, ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం గురించి ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు. ఈ పరిశ్రమ సందర్శనతో విద్యార్థులకు పుస్తకాల్లో నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిశ్రమల పనితీరుతో పోల్చి అర్థం చేసుకునే అవకాశం కలగనుంది.

ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, ECE విభాగాధిపతి డాక్టర్ సంజీవ రెడ్డి, సహాయ విభాగాధిపతి డాక్టర్ సుబ్బరామి రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, విద్యా విభాగాల డీన్లు, కళాశాల మేనేజర్ బి. బాపిరాజు, పరిపాలనా అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar